# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 04-10-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ సార్వజనీన ఆరోగ్య బీమాతో పేదల ఆరోగ్యం కాపాడే బాధ్యత తీసుకుంటామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయడు చెప్పారు.
- ❖ వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా ఉంటాయని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు.
- ❖ జీఎస్టీ రేట్ల తగ్గింపుపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని మంత్రి నాదెండ్ల మనోహర్ కోరారు.
- ❖ వెస్టిండీస్‌తో జరిగిన తొలి టెస్ట్ క్రికెట్ మ్యాచ్‌లో భారత్ భారీ విజయం సాధించింది.

==============================

సార్వజనీన ఆరోగ్య బీమాతో పేదల ఆరోగ్యం కాపాడే బాధ్యత తీసుకుంటామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయడు చెప్పారు.. ఆటో, ట్యాక్సీ, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు ఆర్థిక సహాయం అందించే 'ఆటో డ్రైవర్ల సేవలో' పథకాన్ని ముఖ్యమంత్రి విజయవాడలో ఈ రోజు ప్రారంభించారు. 2,90,669 మంది డ్రైవర్లకు 436 కోట్ల రుపాయలు వారి ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... 25 లక్షల రూపాయాల వరకు అందరికీ ఆరోగ్య బీమా వర్తించేలా చర్యలు చేపట్టామని స్పష్టం చేశారు. దేశంలోనే తొలిసారిగా వాట్సాప్ గవర్నెన్స్ తీసుకొచ్చామని, వాటి ద్వారా 750 సేవలు నేరుగా అందిస్తున్నామని ముఖ్యమంత్రి తెలియజేస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

==============================

వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా ఉంటాయని పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తోడు వంశధార నది ఉప్పొంగడంతో దెబ్బ తిన్న పంట పొలాలను మంత్రి ఈ రోజు పరిశీలించారు. పాతపట్నం నియోజకవర్గంలోని హిరమండలం మండలంలో తుంగతంపర, కల్లట గ్రామాలలో పర్యటించిన మంత్రి రైతులతో మాట్లాడి.. వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పంట నష్టం నివేదికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

==============================

పోలవరం ప్రాజెక్టు ద్వారా 2028 ఆగస్టు నాటికి నీళ్లివ్వాలనే లక్ష్యంతో పనులు చేపడుతున్నామని రాష్ట్ర రహదారులు, భవనాలు శాఖా మంత్రి బీ సీ జనార్ధన్ రెడ్డి వెల్లడించారు. నంద్యాల జిల్లా బనగానపల్లెలో మంత్రి ఈ రోజు పాత్రికేయులతో మాట్లాడుతూ... దేశంలో ఎక్కడా లేని విధంగా ఎన్డీయే కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని చెప్పారు. 4 వేల 500 కోట్ల రూపాయలతో జరుగుతున్న రహదారుల అభివృద్ధి పనులు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. దేశమంతా అమరావతి వైపు చూసే విధంగా రాజధాని నిర్మాణం జరుగుతుందని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో ప్రజలకు అందిస్తోందని వెల్లడించారు.

==============================

జీఎస్టీ రేట్ల తగ్గింపుపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఏలూరులో ఈరోజు 'ఆటో డ్రైవర్ల సేవలో' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల హామీలను రాష్ట్రంలో విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. అందులో భాగంగా 2 వేల 500 కోట్ల రూపాయలతో రాష్ట్రంలో ఉచిత గ్యాస్ పథకాన్ని అమలు చేసి.. 2 కోట్ల 81 లక్షల గ్యాస్ సిలెండర్లను కోటీ 4 లక్షల కుటుంబాలకు అందించామన్నారు. స్త్రీ శక్తి పథకం కింద 96 శాతం మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణాన్ని వినియోగించుకుంటున్నారని తెలిపారు. జీఎస్టీ 2.0లో 800కు పైగా వస్తువులపై పన్నులు తగ్గాయని, విద్య, వైద్యం, బీమాపై జీఎస్టీ ఎత్తివేయడం జరిగిందని మంత్రి వివరిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

విరామం

==============================

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో ఈ రోజు దృశ్య మాధ్యమ విధానంలో విద్యాశాఖాధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో తాగు నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనారోగ్య సమస్యతో బాధపడుతున్న విద్యార్థులను గుర్తించి వెంటనే వైద్యం అందించాలని తెలిపారు. అనారోగ్యంతో ఉన్న విద్యార్థులకు ప్రత్యేక గదులను కేటాయించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్య విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

==============================

రాష్ట్రంలో వెయ్యి కోట్ల రూపాయలతో రహదారుల అభివృద్ధికి చర్యలు చేపట్టామని వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో మంత్రి ఈరోజు పర్యటించారు. ఈ సందర్భంగా జరిగిన ఒక కార్యక్రమలో ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం దూరదృష్టితో వ్యవహరిస్తూ సుపరిపాలనతో రాష్ట్ర పునర్నిర్మాణం చేస్తోందని అన్నారు. జీఎస్టీ 2.0 సంస్కరణలపై విస్తృత ప్రచారం చేపట్టేందుకు కార్యాచరణ సిద్ధం చేశామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందని మంత్రి వివరిస్తూ...

(వాయిస్ 20 సెకన్లు)

==============================

విజయనగరం శ్రీ పైడితల్లి అమ్మవారి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు చేపట్టాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వంగలపూడి అనిత అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డితో కలిసి అమ్మవారి ఉత్సవాల ఏర్పాట్లపై మంత్రి ఈ రోజు సమీక్షించారు. పోలీస్, రెవెన్యూ, దేవస్థానం అధికారులు

సమన్వయంతో పని చేస్తూ ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. మహిళా భక్తులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున అదనపు బస్సులను రద్దీగా ఉన్న మార్గాల్లో నడపాలని రవాణా శాఖ అధికారులకు మంత్రి సూచించారు.

==============================

తాడేపల్లిగూడెం డివిజన్ లో సుమారు 5 వేల ఎకరాలలో వరి తరువాత మినుముల పంట  సాగుచేసేలా రైతులను ప్రోత్సహించాలని వ్యవసాయ అధికారులను పశ్చిమ గోదావరి జిల్లా వ్యవసాయ అధికారి జెడ్. వెంకటేశ్వరరావు ఆదేశించారు. మార్టేరులో వ్యవసాయ అధికారులు, శాస్త్ర వేత్తలకు నిర్వహించిన ఒక రోజు శిక్షణా శిబిరంలో ఆయన మాట్లాడుతూ... 140 రోజుల కన్నా తక్కువ కాల పరిమితి కలిగి, ఎండు తెగులును తట్టుకునే సన్న గింజ రకాలను రూపొందించాలని ఈ సందర్భంగా శాస్త్రవేత్తలను కోరారు.

==============================

అహ్మదాబాద్ వేదికగా వెస్టిండీస్‌తో జరిగిన మొదటి టెస్ట్ క్రికెట్ మ్యాచ్‌లో భారత్ ఇన్నింగ్స్ తేడాతో భారీ విజయం సాధించింది. ఈ రోజు ఉదయం భారత్ తొలి ఇన్నింగ్స్‌ను 448 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. దీంతో రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన వెస్టిండీస్ 146 పరుగులకు ఆలౌట్ అవడంతో భారత్ 140 పరుగుల ఆదిక్యంతో కలిపి ఇన్నింగ్స్ తేడాతో విజయం సాధించింది. భారత బౌలర్లలో రవీంద్ర జడేజా 4, మహ్మద్ సిరాజ్ 3 వికెట్లతో రాణించారు. తొలి ఇన్నింగ్స్‌లో అజేయ శతకంతో పాటు రెండవ ఇన్నింగ్స్‌లో 4 వికెట్ల తీసిన ఆలౌ రౌండర్ రవీంద్ర జడేజా మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డుకు ఎంపికయ్యాడు.

==============================

రాష్ట్రంలో ఉత్తరాంధ్ర జిల్లాల్లో రేపు పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికలు జారీ చేసింది. కొన్ని చోట్ల పిడుగులు పడే అవకాశం ఉందని.. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించింది. 50 నుండి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని.. ప్రజలు అవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు వెళ్లవద్దని విపత్తుల నిర్వహణ సంస్థ తెలియజేసింది. రానున్న రెండు రోజుల వాతావరణ వివరాలను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎల్. వెంకటరావు తెలియజేస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

==============================
==============================